

సిద్దిపేటలో వెయ్యి పడకల దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



పల్లె దవాఖానల కోసం యూనియన్ బ్యాంక్ డొనేట్ చేసిన పిటల్ డాప్లర్ చూపుతున్న మంత్రి హరీశ్‌రావు



వెయ్యి పడకల దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



దవాఖానను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# వైద్యానికి పట్నం పోవాల్సిన పనిలేదు

## సిద్దిపేట అంటేనే నమ్మకం.. సిద్దిపేటలోనే గాంధీ తరహాలో ఇన్నిరకాల వైద్యం

- ప్రాథమిక చికిత్స నుంచి ప్రాణాంతక వ్యాధుల వరకు అన్నిరకాల వైద్యసేవలు
- మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థులు
- ఒకప్పుడు మనం నీళ్లు చూడనోళ్లం.. కానీ ఇప్పుడు కరువు ఎరగనోల్లం
- స్టాఫ్ నర్స్‌లు ఇకనుంచి నర్సింగ్ ఆఫీసర్లుగా పిలుస్తూ ఉత్తర్వులు జారీ
- రూ.15కోట్లతో కాన్సర్ బ్లాక్ ఏర్పాటు
- రూ.23కోట్లతో 50 పడకల సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాకు ఏర్పాటు
- ఆర్థిక వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 5: సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ నిర్మించడం వల్ల కార్మికుల పిల్లలు, పేదపిల్లలు ఈరోజు డాక్టర్లుగా తయారవుతున్నారు. ఢిల్లీ, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతున్నారంటే తెలంగాణ అభివృద్ధి ఏంటో అర్థమవుతుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలో మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నూతనంగా నిర్మించిన 1000 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానను జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, టీఎస్ఎంఐడీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 175 సీట్లు సిద్దిపేట మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ఉన్నాయి. ఇందులో 25% అంటే 25 సీట్లు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి చదువుతున్నారన్నారు. సిద్దిపేట అంటేనే నమ్మకం అన్నారు. అందుకే చాలామంది పిల్లలు వైద్య విద్య కోసం సిద్దిపేటకు వచ్చారన్నారు. సంపన్నుల పిల్లలే డాక్టర్ చదువు చదవాలన్న నానుడిని మారుస్తూ రైతులు, కూలీల పిల్లలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారన్నారు. గతంలో సిద్దిపేట మెడికల్ కాలేజ్ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ, ఉస్మానియా దవాఖానకి పంపించే వారు, కానీ ఇక్కడే సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయన్నారు. రూ.15 కోట్లతో నూతన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసుకున్నామని, ఇక నుంచి క్యాన్సర్ చికిత్సలైన కీమో థెరపీ, రేడియోథెరపీ సేవలు ఇక్కడే అందుతాయని మంత్రి చెప్పారు. అంతేకాకుండా 40 పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్యాత్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల గుండె సంబంధింత వైద్య చికిత్సలు అందుతాయని చెప్పారు. 15 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందులో 8 మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. 100 ఐసీయూ బెడ్లు పూర్తి సామర్థ్యంతో సిద్ధంగా ఉన్నాయన్నారు.

### 30 పడకలతో ఎమర్జెన్సీ వార్డు

క్రిటికల్ కేర్ వార్డులో 30 పడకలతో ఎమర్జెన్సీ వార్డు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 23 కోట్లతో 50 పడకల సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాకు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. 875 మంది వైద్య విద్యార్థులు ఉంటారు. 13 డిపార్ట్మెంట్‌లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మరో 3 నూతన పీజీ సీట్లుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది 62మంది పీజీ విద్యార్థులకు కూడా చదివే అవకాశం ఉందన్నారు. స్టాఫ్ నర్స్‌ల పేరు మారుస్తూ నర్సింగ్ ఆఫీసర్లుగా పిలుస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నర్సింగ్, బీఫార్మసీ, పారామెడికల్ కాలేజ్‌లు సిద్దిపేటలో ఉన్నాయి. సిద్దిపేట వేయి పడకలు దవాఖానలో ఇకనుంచి 280 మంది డాక్టర్లు 24గంటలు సేవలు అందిస్తారని చెప్పారు. వీరితోపాటు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న 150 మంది డాక్టర్లు కూడా సేవలు అందిస్తారన్నారు. ప్రాథమిక చికిత్స నుంచి ప్రాణాంతక వ్యాధుల వరకు అన్ని రకాల వైద్యసేవలు ఇక్కడే అందుతాయని మంత్రి తెలిపారు. మతా, శిశు విభాగంలో జనరల్ దవాఖానలో మిగతా అన్ని విభాగాలు బోధానాసుపత్రిలో ఏర్పాటు చేశామన్నారు. దీంతో తన జన్మ ధన్యమైందన్నారు. ఒకప్పుడు మనం నీళ్లు చూడనోళ్లం.. కానీ ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్‌తో సిద్దిపేటలో లక్ష ఎకరాల్లో పంటలు సాగు చేస్తుకుంటున్నాం. సిద్దిపేటను జిల్లా చేసుకున్నాం, గోదావరి నీళ్లు, రైల్ కూడా తెచ్చుకున్నమని మంత్రి చెప్పారు. వేయి పడకల దవాఖాన మనకు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దవాఖాన ప్రారంభించిన అనంతరం మంత్రి హరీశ్‌రావు ఎంబీబీఎస్ విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విమలాథామస్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీలు మాణిక్యరెడ్డి, బాలకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, టీఎస్ ఎంఐడీసీ ఇంజినీర్లు విశ్వప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ఎంపీపీ ఎల్లం, స్థానిక సర్పంచ్ రవీందర్ గౌడ్, ఎంపీటీసీ స్రవంతీప్రశాంత్ పాల్గొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు పేదల చెంతకు సర్కార్ వైద్యాన్ని తీసుకొచ్చారు. ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు విశ్వాసం కల్పించారని జడ్పీచైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. సిద్దిపేటలో 1000 పడకల దవాఖానను ప్రారంభించడం మనందరికీ గర్వకారణమని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. ఆరోగ్యానికి మించిన సంపద లేదని, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు అద్భుతమైన సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేశారని టీఎస్ఎంఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



హాజరైన ప్రజలు



పొన్నాల శివారులో ముదిరాజ్ ఏసీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ తదితరులు



మంత్రి హరీశ్‌రావుకు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న ముదిరాజ్ మహిళలు



సభకు హాజరైన ముదిరాజ్‌లు

# ముదిరాజ్‌లకు సముచిత స్థానం

**రూ. 1000 కోట్లతో మత్స్యకారులకు ఉపాధి**

- ముదిరాజ్ ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో సిద్దిపేట ఆదర్శం
- జిల్లాలో 98 కొత్త సొసైటీలు
- గతంలో సొసైటీ ఏర్పాటుకు మూడేండ్లు పట్టేది
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు
- పొన్నాల శివారులో ముదిరాజ్ ఏసీ ఫంక్షన్‌హాల్ ప్రారంభం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 5: సిద్దిపేట అన్నిరంగాల్లో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, ముదిరాజ్ ఫంక్షన్ హాల్ నిర్మాణంలోనూ ఆదర్శంగా నిలిచామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల శివారులో మూడు ఎకరాల స్థలంలో రూ.7.5 కోట్లతో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ ఏసీ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముదిరాజ్‌ల కోసం రూ.7.5కోట్లతో సిద్దిపేటలో ఉత్తమమైన ఫంక్షన్‌హాల్‌ను నిర్మించుకున్నామన్నారు. మిగతా సౌకర్యాల కల్పనకు మరో రూ.50 లక్షలు మంజూరు చేస్తానన్నారు. సిద్దిపేట పట్టణంతో పాటు చాలా గ్రామాల్లో ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్లను నిర్మించుకున్నామని చెప్పారు. అంతే కాకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పెద్దమ్మ ఆలయాలకు సాయం చేసినట్లు గుర్తు చేశారు. సాయం చేయడమే కాకుండా పెద్దమ్మతల్లి ఉత్సవాలకు స్వయంగా హాజరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడేండ్లు తిరిగినా ఒక కొత్త సొసైటీ రాకుండే, కానీ సీఎం కేసీఆర్ ఇప్పటివరకు 2 వేల సొసైటీలు ప్రారంభించి, 2 లక్షల మందికి కొత్తగా సభ్యత్వాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. వారిలో 80శాతం మంది ముదిరాజులే ఉన్నారన్నారు. ఒక సిద్దిపేట జిల్లాలోనే 98 కొత్త సొసైటీలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కులు గ్రామంలో ఉన్న మత్స్యకారులకే ఇవ్వాలని నిర్ణయించిన నాయకుడు కేవలం సీఎం కేసీఆర్ మాత్రమే అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.1000 కోట్లతో మత్స్యకారులకు వివిధ రకాల వస్తువులు పంపిణీ చేసి, ఉపాధి కల్పించిన ఘనత కూడా సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో ముదిరాజ్‌లకు క్యాబినేట్ మంత్రి హోదాతోపాటు రాజ్యసభ సభ్యత్వం, శాసనమండలి వైస్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్ మొదటిసారిగా కల్పించింది సీఎం కేసీఆర్ మాత్రమే మని మంత్రి అన్నారు. ఇంకా భవిష్యత్‌లో ముదిరాజ్‌ల గౌరవం పెరిగేలా ప్రభుత్వంలో, చట్టసభల్లో అవకాశం కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కొందరు రాజకీయంగా చిచ్చుపెట్టి లబ్ధిపొందేందుకు యత్నిస్తున్నారని, వారి ఉచ్చులో పడకూడదని మంత్రి సూచించారు. భవిష్యత్‌లో సిద్దిపేట జిల్లాలో కూడా ముదిరాజ్‌లకు అనేక అవకాశాలు కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీనిచ్చారు.

## ముదిరాజులకే గర్వకారణం

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్**

సిద్దిపేటలో నిర్మించిన ఏసీ కన్వెన్షన్ హాల్ తెలంగాణ రాష్ట్ర ముదిరాజులకే గర్వకారణమని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ అన్నారు. ఫంక్షన్ హాల్ నిర్మించిన మంత్రి హరీశ్‌రావుకు ముదిరాజ్‌ల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా హుస్నాబాద్‌లో కూడా ముదిరాజ్ ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు స్థల సేకరణకు ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న కొమురవెళ్లితో పాటు ప్రముఖ ఆలయాల వద్ద ముదిరాజ్‌ల కోసం సత్రాలు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో హైదరాబాద్‌లోని కోకాపేటలో 5 ఎకరాల స్థలాన్ని ముదిరాజ్ ఆత్మగౌరవ భవనం కోసం కేటాయించారన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ముదిరాజ్ ఆత్మగౌరవ భవనాలు నిర్మించుకున్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరికీ సొసైటీలో సభ్యత్వం ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో చేపలు పట్టుకునే సర్వ హక్కులు మత్స్యకారులకు కల్పించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# అందరూ మెచ్చేలా అభివృద్ధి

- సిద్దిపేట అభివృద్ధి ని చూసి ఓరుస్తలేరు
- చిన్నకోడూరు మండలంలో కాంగ్రెస్‌కు షాక్
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 5: అభివృద్ధిలో సిద్దిపేటను దేశంలోనే ఆదర్శంగా నిలిపి పేరుప్రతిష్ఠను ఎల్లలు దాటేలా చాటి చెప్పామని ఆర్థిక వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో చిన్నకోడూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపల్లి గణేశ్, మైలారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శ్రావణ్‌రెడ్డి, నంగునూర్ మండల బీజేపీ ప్రధానకార్యదర్శి జీవన్‌రెడ్డి తదితరులు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కం డువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధిని అందరూ మెచ్చుకునేలా చేసుకున్నామని, అన్నింటా అభివృద్ధి చేసుకొని దేశ స్థాయిలో ఆదర్శంగా నిలిపామని చెప్పా రు. ప్రతిపక్షాలు సైతం మన అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని వాళ్లకు ఓటుతో బుద్ధి చెబుదామన్నారు. అందరం కలిసి మరిం త అభివృద్ధి చేసుకుందామని, పార్టీ బలోపేతానికి పాటు పడదామని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి గుర్తింపు ఉంటుందని, సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి చెప్పారు.

### చిన్నకోడూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ

చిన్నకోడూర్ మండలంలో కాంగ్రెస్ ఖాళీ అయింది. ఆ పార్టీకి చెందిన మండలాధ్యక్షుడు మిట్టపల్లి గణేశ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. అతడితో పాటు అనుచరులు కట్కూరి శ్రీనివాస్, బాలకృష్ణ, నరాల కృష్ణ, బాబు, లక్ష్మణ్, కనకయ్య, చేరారు. నంగునూర్ బీజేపీ మండల ప్రధానకార్యదర్శి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాగుల మైసయ్య, శ్రీనివాస్, చిన్నకోడూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ (అమెరికా) అన్నాడి శ్రావణ్‌రెడ్డితోపాటు ఉపేందర్, లింగం, అంజి మంత్రి సమక్షంలో చేశారు. పట్టణ కాంగ్రెస్ సలహాదారు చందు, సోహెల్, రాకేశ్, ఆకాశ్ బీఆర్ఎస్‌లో చేరారు.



సిద్దిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు